మోదీ పాలన వస్తే
దేశానికే చేటు!

● తిరువారూరు సభలో సీఎం స్టాలిన్


సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, మార్చి 23 : మతవాదాన్ని గట్టిగా నమ్ముతున్న ప్రధాని నరేంద్రమోదీ మళ్ళీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం సర్వనాశనమవుతుందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. తిరువారూరు లోక్‌సభ నియోజకవర్గం డీఎంకే అభ్యర్థి మురుసొలికి మద్దతుగా కొరడాచేరిలో శనివారం సాయంత్రం ఏర్పాటైన ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ గత 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరఫున ఇచ్చిన హామీలలో ప్రధాని మోదీ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు పరచలేదని ఆరోపించారు. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీసి దేశ ప్రజలకు ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలోనూ రూ.15 లక్షలను జమ చేస్తామన్న హామీ ఏమైందని, కనీసం రూ.15 కూడా జమ చేయకుండా మోసగించారని ఆరోపించారు. యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మించి ఓట్లు దోచుకున్న బీజేపీ పెద్దలు తొమ్మిదేళ్ల దాటినా ఆ హామీని నెరవేర్చకపోవడం వల్ల నిరుద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలోని హామీలన్నింటిని భేషరతుగా అమలుపరుస్తామన్నారు. అన్నదాతలకు పంటల బీమా పథకం కింద లబ్ధి చేకూర్చడంతోపాటు వారి బ్యాంక్ రుణాలను మాఫీ చేస్తామన్నారు. అలాగే పెట్రోలు, డీజిల్ ధరలతోపాటు గ్యాస్ సిలిండర్ ధరను కూడా తగ్గిస్తామన్నారు. జాతీయ రహదారులలో ఉన్న అన్ని టోల్‌ప్లాజాలను తొలగిస్తామని, ఉమ్మడి పౌరసత్వం చట్టాన్ని రద్దు చేయిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. సొంత ఇల్లులేని కుటుంబాలకు ఉచిత ప్లాట్‌లను కేటాయించడంతోపాటు బ్యాంకు రుణాలు అందించే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ దాఖలు చేశామని, ఆ పథకంలో లబ్ధిపొందబోయేదీ తిరువారూరు, నాగపట్టినం జిల్లాలకు చెందిన ప్రజలేనన్నారు. అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళని స్వామి సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రానికి చెందిన కావేరి, ముల్లై పెరియార్ సమస్యలను కేంద్రంతో మాట్లాడి పరిష్కరించకుండా మిన్నకుండి, డీఎంకేను విమర్శించడం సరికాదన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా, రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణకు ఆటంకాలు కలిగిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు వరకూ వెళ్ళామని, అయితే మాజీ ముఖ్యమంత్రిగా ఈపీఎస్ ఒక్కసారి కూడా గవర్నర్ తీరును ఖండించలేదన్నారు.

‘ఓం నమఃశ్శివాయ’

● అట్టహాసంగా ‘అరుప్పత్తుమూవర్ విళా’


మైలాపూరు మాడవీధిలో ఊరేగుతున్న నాయన్మార్లు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడిని జీవితపర్యంతం ఆరాధించి ఆ స్వామి గుణగణాలను లోకానికి చాటిచెప్పేలా కీర్తనలు ఆలపించి ముక్తినొందిన తిషష్ఠి (63 మంది) నాయన్మార్ల ఉత్సవం నగరంలోని మైలాపూరు కపాలీశ్వరాలయంలో శనివారం మధ్యాహ్నం అట్టహాసంగా జరిగింది. వెండి విమానంలో కపాలీశ్వరస్వామితో పాటు పల్లకీలలో 63 మంది నాయన్మార్లు ఆలయ నాలుగు మాడవీధుల్లో వేలాదిమంది భక్తుల నడుమ ఊరేగారు. ఒకే సమయంలో ఇలా 63 మంది శైవభక్త శిఖామణుల దర్శనభాగ్యం లభించడంతో భక్తులంతా పారవశ్యం చెందారు. ఈ వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలించారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మైలాపూరు క్షేత్రానికి భక్తుల రాక ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండుగంటలకల్లా రాయపేట హైరోడ్డు, లజ్ చర్చి రోడ్డు, ఆర్కేమఠం రోడ్డు భక్తజనంతో నిండిపోయాయి. కపాలీశ్వరాలయ నాలుగు మాడవీధుల్లో ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం 330 గంటలకు పల్లకీలలో నాయన్మార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూలతో అలంకరించారు. ఆ తర్వాత ఆలయ సిబ్బంది, భక్తులు పల్లకీలను మోసుకుంటూ ఆలయ వాహన మండపం నుంచి వెలుపలకు వచ్చారు. అప్పటికే అక్కడ గుమికూడిన భక్తులంతా నాయనార్లకు చేతులెత్తి మొక్కుతూ ‘ఓం నమఃశ్శివాయ’ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆలయ తూర్పు దిశ వీధి నుంచి బయలుదేరిన ఈ పల్లకీలు నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. ప్రధాన రహదారుల్లో ఇరువైపులా నిలిచిన భక్తులంతా నాయన్మార్లపై పూల వర్షం కురిపించారు. దక్షిణమాడవీధి, ఉత్తర మాడవీధి, తూర్పు మాడవీధి, ఆర్కే మఠం రోడ్డు మీదుగా సాగిన ఈ ఊరేగింపు శనివారం సాయంత్రం ఐదు గంటలదాకా కొనసాగింది. మైలాపూరు అంతటా చలువ పందిళ్లు వేసి వ్యాపారుల సంఘం నిర్వాహకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, శ్రీరామకృష్ణ మఠం నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. చల్లటి మజ్జిగ, పానకం, పాయసం తదితర పానీయాలను కూడా పంపిణీ చేశారు. సుమారు 1000 మంది పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు సదుపాయాలు కలిగించారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ఈ వేడుకలలో అన్నదానం జరిపే ప్రతిచోటా పెద్ద పెద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. వాటర్ క్యాన్‌ల ద్వారా భక్తులకు మంచినీటిని అందించారు.


పల్లకీలలో ఊరేగుతున్న నాయన్మార్లు


విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

బంగారు భవితకు తెలుగే భద్రత

● తెలుగు తరణి అధ్యక్షురాలు కాసల రమణి
● ఘనంగా శ్రీ వెంకటేశ్వర తెలుగు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ప్యారీస్, మార్చి 23: బంగారు భవితకు తెలుగు భద్రతా కవచంగా ఉంటుందని తెలుగు తరణి అధ్యక్షురాలు కాసల రమణి అభివర్ణించారు. స్థానిక నుంగంబాక్కం కుమరప్ప వీధిలో శ్రీ వెంకటేశ్వర తెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర విద్యాలయం 74వ వార్షికోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. పాఠశాల గౌరవ అధ్యక్షులు సీఆర్ మోహనరావు అధ్యక్షత వహించగా, గౌరవ ఉపాధ్యక్షులు విజయలక్ష్మి చుక్కల పాఠశాల నిర్వహణకు చేపడుతున్న పథకాల గురించి వివరించారు. గౌరవ కార్యదర్శి సీఆర్ రామమూర్తి, కోశాధికారి కేఎస్ ప్రశాంత్ కుమార్, కార్యదర్శి సీఎస్ రామకృష్ణ, ఉప కార్యదర్శి వీఎస్ హరినాథ్, కమిటీ సభ్యులు సి.రాజేంద్ర, కేపీ సుచరిత, సి.మురళి, ఎస్.బాలసుబ్రమణ్యం, జేఎం నాయుడు, ప్రధానోపాధ్యాయులు ఎం.మోహన్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ డెర్మటాలజిస్ట్ ప్రొఫెసర్ డా.వేణుగోపాల్, ఎట్రో డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కె.జయశ్రీ దంపతులు పాల్గొని, శ్రీవెంకటేశ్వర తెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ పాఠశాలలో చదువుకొని స్వదేశీ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో ఉన్న పలువురు పాఠశాలకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తున్నారని, వారిలాగే తాము కూడా పాఠశాల అభివృద్ధి పథకాల నిమిత్తం విరాళంగా రూ.50,000 అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాసల రమణి మాట్లాడుతూ... ప్రపంచ భాషల్లో తీయదనం పంచే తెలుగు భాషకు తమిళనాడులో తగిన గుర్తింపు సన్నగిల్లిందని, 30 ఏళ్ల వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న తెలుగు మీడియం పాఠశాలల సంఖ్య ప్రస్తుతం బాగా తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమిక విద్య నుంచి తెలుగులో చ ది విం చాలని, మాతృభాషలో చదివితే వారి భవిష్యత్తు చక్కగా ఉంటుందన్నారు. తెలుగు తరణి తరఫున తెలుగు మీడియంలో ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులకు నగదు బహుమతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు కూడా అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పలు పోటీల్లో పాల్గొన్న విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అతిథులు పంపిణీ చేసి అభినందించారు.

నేడు అన్నామలై ఆలయంలో తిరుకల్యాణం

అడయార్, మార్చి 23: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో పంగుణి ఉత్తిర తిరుకల్యాణ వేడుక ఆదివారం జరుగనుంది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11.45 గంటల వరకు అరుణాచలేశ్వర స్వామి సన్నిధిలో స్వామి వారికి అమ్మవారికి తిరుకల్యాణం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు ధ్వజస్తంభం ముందు ప్రత్యేక వేడుకలు, పూజలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి 12గంటలకు బంగారు రిషభ వాహనంలో నాలుగు మాఢ వీధుల్లో ఊరేగింపునకు వెళతారు. ఈ వేడుకలు ఈ నెల 28వ తేదీ వరకు జరుగుతాయి.

వీఐపీ నియోజకవర్గాలు ఇవీ..

ప్యారీస్, మార్చి 23: రాష్ట్రం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి పలువురు ముఖ్యులు పోటీ చేయనున్నారు. బీజేపీ నుంచి మాజీ గవర్నర్‌తో పాటు మాజీ ఐపీఎస్ అధికారి, కేంద్రమంత్రి, ఓ మాజీ మంత్రి పోటీ చేస్తుండగా, ఈ నలుగురూ ఆ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షులుగా పని చేసిన వారే కావడం విశేషం. అదే విధంగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీల అగ్రనేతలు, వారి కుటుంబసభ్యులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ 19న ఒకే విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఈసారి ఎన్నడూ లేని విధంగా స్టార్ అభ్యర్థులు పోటీచేస్తున్న కారణంగా పలు నియోజకవర్గాలు వీఐపీ స్థానాలుగా గుర్తింపు పొందాయి. ఆ నియోజకవర్గాలు ఏమేమంటే..?!

దక్షిణ చెన్నై: తెలంగాణా, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్‌గా వ్యవహరించిన డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ బీజేపీ తరఫున దక్షిణ చెన్నైలో పోటీచేస్తున్నారు. ఆమెతో ప్రస్తుత డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ కుమారుడు డా.జయవర్ధన్ తలపడుతున్నారు. దీంతో ఈ నియోజకవర్గానికి వీఐపీ హోదా వచ్చింది.

విరుదునగర్: నాడార్ సామాజిక వర్గాల ఓటర్లు అధికంగా ఉన్న విరుదునగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా సినీ నటి రాధిక శరత్‌కుమార్ పోటీచేస్తుండగా, ఆమెకు పోటీగా దివంగత నటుడు డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ కుమారుడు విజయ్ ప్రభాకర్ అన్నాడీఎంకే కూటమి తరఫున బరిలో ఉన్నారు. ఇక, కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది శనివారం సాయంత్రం వరకు స్పష్టత రాలేదు.

పెరంబలూరు: ఈ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున ఇండియా జననాయగ పార్టీ వ్యవస్థాపకులు, ఎస్‌ఆర్‌ఎం విద్యాసంస్థల ఛైర్మన్ డా.పారివేందర్ కమలం గుర్తుపై పోటీచేస్తున్నారు. ఆయనను వ్యతిరేకిస్తూ రాష్ట్ర నగరాభివృద్ధి శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ కుమారుడు అరుణ్ నెహ్రూ, అన్నాడీఎంకే అభ్యర్థిగా డా.చంద్రమోహన్ పోటీచేస్తున్నారు.

తేని: ఈ నియోజకవర్గంలో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ బీజేపీ కూటమి తరఫున కుక్కర్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. డీఎంకే తరఫున తంగ తమిళ్‌సెల్వన్ బరిలో ఉన్నారు.

వేలూరు: న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంజీఆర్ విద్యాసంస్థల అధినేత, మాజీ ఎంపీ ఏసీ షణ్ముగం బీజేపీ కూటమి తరఫున ఈ నియోజకవర్గంలో కమలం గుర్తుపై పోటీచేయనున్నారు. ఆయనకు వ్యతిరేకంగా డీఎంకే తరఫున సిట్టింగ్ ఎంపీ, రాష్ట్ర సీనియర్ మంత్రి దురైమురుగన్ కుమారుడు కదిర్ ఆనంద్ పోటీలో ఉన్నారు. అన్నాడీఎంకే అభ్యర్థిగా పసుపతి పోటీచేయడం గమనార్హం.

తిరునల్వేలి: రాష్ట్ర బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ నయనార్ నాగేంద్రన్ కమలం గుర్తుపై ఈ నియోజకవర్గంలో పోటీచేస్తున్నారు. ఆయనకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే తరఫున ఝాన్సీ రాణి బరిలో ఉన్నారు.

కన్నియాకుమారి: ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిచెందిన కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర మాజీ మంత్రి పొన్.రాధాకృష్ణన్ బీజేపీ తరఫున పోటీలో ఉన్నారు. ఆయనకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే అభ్యర్థి బసిలియాన్ నజరేత్ పోటీ చేస్తుండగా, ఈ స్థానంలో కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది ప్రకటించలేదు. అయితే కాంగ్రెస్ తరఫున విజయ్‌వసంత్ పేరు దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది.

కడలూరు: తమిళ సినీ దర్శకుడు, కెమెరామెన్ తంగర్ బచ్చన్ బీజేపీ కూటమిలోని పీఎంకే అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. అలాగే, ధర్మపురి నియోజకవర్గంలో పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి సతీమణి సౌమ్య బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్నారు. అలాగే, నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కేంద్ర సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్ బీజేపీ తరఫున, డీఎంకే తరఫున సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా, అన్నాడీఎంకే తరఫున లోకేష్ తమిళ్‌సెల్వన్‌లు, పరిశ్రమల నగరం కోయంబత్తూర్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, అన్నాడీఎంకే తరఫున సింగై రామచంద్రన్, డీఎంకే తరఫున గణపతి పి.రాజ్‌కుమార్‌లు ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ వీఐపీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అగ్రనేతలు, సినీ కళాకారులు, పలు రంగాలకు చెందిన రాజకీయ ప్రముఖులు తమ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రచారంలో పాల్గొననున్నారు.

ప్రశాంతంగా ఎన్నికల జరిపేందుకు సహకరించండి

● అఖిలపక్షానికి ఈసీ పిలుపు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రధానాధికారి సత్యప్రదసాహు పిలుపునిచ్చారు. సచివాలయంలో శనివారం ఉదయం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత ఓటర్ల జాబితాలను అన్ని రాజకీయపార్టీలకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి, ఎన్‌ఆర్ ఇళంగో, అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి డి.జయకుమార్, న్యాయవాదుల విభాగం కార్యదర్శి ఇన్బదురై, బీజేపీ తరఫున ఆ పార్టీ కార్యదర్శి కరాటే త్యాగరాజన్, కాంగ్రెస్ తరఫున ఎస్కే నవాజ్, చంద్రమోహన్, సీపీఐ తరఫున రవీంద్రనాథ్ పెరియసామి, సీపీఎం తరఫున భీమరావు, ఆరుముగనయినార్, డీఎండీకే తరఫున న్యాయవాది సంతోష్‌కుమార్, మారన్, బీఎస్పీ తరఫున సత్యమూర్తి, చార్లెస్, దేశియ మక్కల్ కట్చి తరఫున శీనివాసన్, కార్తీక్, లోక్ తాంత్రిక్ జనతాదళ్ తరఫున కార్తికేయన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమ నిబంధనలు గురించి సమగ్రంగా చర్చలు జరిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత కల్పించాలని డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ పార్టీల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సత్యప్రద సాహు బదులిస్తూ.. ఎన్నికల్లో రాష్ట్ర పోలీసులు, హోంగార్డులతో పాటు పారామిలటరీ దళాలను కూడా తెప్పిస్తున్నామని, పటిష్ఠమైన భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. ఓటర్లకు నగదు, కానుకలు పంపిణీ కాకుండా ఎన్నికల సంఘం నిఘా అధికారులు గస్తీ వాహనాలలో 24 గంటలపాటు షిఫ్ట్ పద్ధతిలో డ్యూటీ చేయనున్నారని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామని, ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు అన్ని వసతులు కల్పిస్తామని, ఎండవేడిమి తెలియకుండా షామియానాలు కూడా ఏర్పాటు చేస్తామని, వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు కూడా తగు వసతులు కల్పిస్తామని వివరించారు.

పాపం విజయతరణి!

● ఎమ్మెల్సీ పదవీ పాయె.. మళ్లీ అవకాశం రాకపోయె!



అడయార్, మార్చి 23: ఇటీవల భారతీయ జనతా పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విజయతరణి పరిస్థితి అగమ్యగోచరంలో పడిపోయింది. ఎంపీ సీటుకు ఆశపడిన ఆమె తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. పిమ్మట కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కాషాయ కండువా కప్పుకున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కన్నియాకుమారి లోక్‌సభ సీటును తనకు కేటాయిస్తారని గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ, ఆ స్థానాన్ని ఆ పార్టీ సీనియర్ నేత పొన్ రాధాకృష్ణన్‌కు బీజేపీ కేటాయించింది. దీంతో తన రాజీనామాతో ఉప ఎన్నిక జరిగే విలవంగోడు అసెంబ్లీ సీటునైనా కేటాయిస్తారని భావించారు. చివరకు అక్కడ కూడా మొండి చేయి చూపించారు. ఆ స్థానాన్ని నందిని అనే మహిళా అభ్యర్థికి కేటాయించారు. దీంతో విజయతరణి దిగ్భ్రాంతిలో పడిపోయారు. ఎంపీ సీటుకు ఆశపడి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరితే.. ఆ నేతలు తనను అటూఇటూ కాకుండా చేశారంటూ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఆమెను సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో విజయతరణి వైఖరి ఓ లేడీ బాస్‌లా ఉండేదని ఆ పార్టీ నేతలు గుర్తు చేసుకుంటున్నారు. గత 2021 ఎన్నికల్లో ఆమె విలవంగోడు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత శాసనసభలో కాంగ్రెస్ విప్ పదవి ఇచ్చారు. కానీ, ఆమె మాత్రం అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత పదవి కోసం డిమాండ్ చేశారు. కానీ ఆ పదవిని ఆమెకు ఇవ్వలేదు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో కన్నియాకుమారి స్థానం కేటాయించాల్సిందేనంటూ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. ఇంతలో ఏం జరిగిందో ఏమోగానీ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. కానీ ఇప్పుడక్కడ ఆమెకు తీవ్ర నిరాశ ఎదురైంది.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు

ఎడతెగని చర్చలు - కొత్త ముఖాల కోసం రాహుల్ పట్టు

అడయార్, మార్చి 23: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే అంశంపై కాంగ్రెస్ అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. నిజానికి శుక్రవారం రాత్రి అభ్యర్థుల తుదిజాబితా కోసం ఒక్కో స్థానం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లతో లిస్టును తయారు చేశారు. ఇందులో ఒక్కో అభ్యర్థిని ఎంపిక చేసేందుకు పార్టీ అగ్రనేత రాహుల్ సారథ్యంలో శుక్రవారం ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. ఇందులో ప్రతిపాదిత జాబితాను చూసిన రాహుల్... తిరునల్వేలి, తిరువళ్ళూరు, మైలాడుదురై, కడలూరు స్థానాల్లో అభ్యర్థులను మార్చాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో తుది జాబితాను ఖరారు చేయలేకపోయారు. ఆ తర్వాత కొన్ని మార్పులు చేర్పులతో కొత్త జాబితాను తయారు చేసినట్టు సమాచారం. ఈ జాబితాలో ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న కార్తీ చిదంబరం, జ్యోతిమణి, మాణిక్యం ఠాగూర్, విజయ్‌వసంత్‌లకు వరుసగా శివగంగై, కరూర్, విరుదునగర్, కన్నియాకుమారి స్థానాలను కేటాయించినట్టు తెలుస్తోంది. అలాగే, తిరునెల్వేలి స్థానాన్ని రాబర్ట్ బ్రూస్, కృష్ణగిరి స్థానాన్ని గోపినాథ్, కడలూరుకు నమోరామచంద్రన్, మైలాడుదురైకు విష్ణు ప్రసాద్, తిరువళ్ళూరు రిజర్వుడ్ స్థానానికి విశ్వనాథన్ లేదా శశికాంత్ సెంథిల్ పేర్లను రాహుల్ ప్రతిపాదించినట్టు సమాచారం. కాగా, డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తమిళనాడులో తొమ్మిది నియోజకవర్గాలు, పుదుచ్చేరి స్థానాన్ని కేటాయించిన విషయం తెల్సిందే.

రంజాన్ వేళలు
ఆదివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26
సోమవారం : సహర్ : ఉదయం - 4.29



మతవాదాన్ని అణిచివేసేందుకే డీఎంకే కూటమికి మద్దతు

● ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్



పెరంబూర్, మార్చి 23: బీజేపీ మతవాద రాజకీయాలు చేస్తున్నందుకే, దానికి వ్యతిరేకంగా డీఎంకే కూటమికి మద్దతు తెలిపినట్లు మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు, నటుడు కమల్ హాసన్ ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతివ్వడంతో పాటు రాజ్యసభ సీటుతో సరిపెట్టుకోవడంపై కమల్‌హాసన్ వివరణ ఇస్తూ... తొలుత అభిమాన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నానని, ఆ సమయంలో రాజకీయాలు అంటే తనకు నచ్చేవి కావన్నారు. అనంతరం మంచి రాజకీయాలు కూడా నడువవచ్చని నిర్ణయించుకొని, అలాంటి సిద్ధాంతాలతో రాజకీయాల్లోకి ప్రవేశించానని తెలిపారు. మక్కల్ నీది మయ్యం పార్టీ డీఎంకే కూటమిలో చేరడంపై కొతమంది తనను విమర్శిస్తున్నారన్నారు. ప్రస్తుతం దేశంలో ఒక పార్టీ ప్రజల మధ్య విభేదాలు సృష్టించాలని యత్నిస్తోందన్నారు. ఇలాంటి శక్తులను నిరోధించాలనే లక్ష్యంతోనే డీఎంకే కూటమికి మద్దతు తెలిపానని వివరణ ఇచ్చారు. అలాగే, తాను అనుకొని ఉంటే కూటమి నుంచి 3, 4 స్థానాలు పొందేవాడినన్నారు. డీఎంకే కూటమి బలంగా ఉండాలన్న సదుద్దేశంతోనే తాను నిర్ణయం తీసుకున్నానన్నారు. ‘ఇండియా’ కూటమికి నేతృత్వం వహించేందుకు రాహుల్ గాంధీ సరైన వ్యక్తిగా తాను భావిస్తున్నట్లు కమల్‌హాసన్ తెలిపారు.

ఐఎంఎల్‌కు ‘నిచ్చెన’ గుర్తు

అడయార్, మార్చి 23: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి భాగస్వామ్య పార్టీగా ఉన్న ఇండియన్ ముస్లిం లీగ్ (ఐఎంఎల్)కు కేంద్ర ఎన్నికల సంఘం “నిచ్చెన” గుర్తును కేటాయించింది. ఈ చిహ్నామే కేటాయించాలని ఐఎంఎల్ చేసిన విన్నపాన్ని పరిశీలించిన సీఈసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఐఎంఎల్ అభ్యర్థి నవాజ్ గనీ మళ్ళీ రామనాథపురం స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

సమాచార దృష్టి

ఐచ్ఛికంగా సిలిండర్ కొనుగోలు

ఐసిఎఫ్, మార్చి 23: వంటగ్యాస్ సిలిండర్లను ఐచ్ఛికంగా కొనుగోలు చేసే సౌకర్యాన్ని ఇండియన్ ఆయిల్ సంస్థ (ఐఓసీ) కల్పించింది. ఈ సంస్థ 14.20 కిలోల బరువున్న గృహ వినియోగ సిలిండర్, 5 కిలోలు, 2 కిలోల బరువుతో చిన్నరకం సిలిండర్లు విక్రయిస్తోంది. 10 కిలోలు, 5 కిలోలు, 2 కిలోలు సిలిండర్లు స్టాక్ ఉండేలా చూసుకోవాలని ఏజెన్సీలకు ఐఓసీ ఉత్తర్వులు జారీచేసింది.

నాలుగు నెలల్లో చెన్నై బీచ్-ఎగ్మూర్ నాలుగవ మార్గం

ఐసిఎఫ్, మార్చి 23: చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య జరుగుతున్న నాలుగవ రైలు మార్గం పనులు నాలుగు నెలల్లో పూర్తవుతాయని చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో రూ.280 కోట్ల వ్యయంతో కొత్త మార్గం పనులు జరుగుతున్నాయి. పార్క్ టౌన్, ఫోర్ట్ స్టేషన్‌లలో ట్రాక్ వేయడానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, మరో నాలుగు నెలల్లో పనులు పూర్తవుతాయని, అనంతరం బీచ్-వేళచ్చేరి మధ్య రైలు సేవలు పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

1 నుంచి ప్లస్ టూ జవాబుపత్రాల మూల్యాంకనం

ఐసిఎఫ్, మార్చి 23: ప్లస్ టూ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1వ తేది నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 1వ తేది ప్రారంభమైన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. సుమారు 8 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరి జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 13వ తేది వరకు జరుగనుంది. మే 6వ తేది పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయి.

రేపటితో ముగియనున్న ప్లస్ వన్ పరీక్షలు...

ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. ఆరోజు గణితం, జువాలజీ, కామర్స్, మైక్రో బయాలజీ, ఫుడ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చరల్ సైన్స్, నర్సింగ్ వంటి సబ్జెక్ట్‌లకు పరీక్షలు జరుగనున్నాయి.

డిప్లొమో పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 23: ఉపాధ్యాయుల పోస్టులకు నిర్వహించనున్న ప్రాథమిక విద్య డిప్లొమో పరీక్షకు ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్ష శాఖ డైరెక్టర్ సేతురామవర్మ తెలిపారు. జూన్ 20వ తేది నుంచి జూలై 21వ తేది వరకు జరుగనున్న ఈ పరీక్షల్లో పాల్గొనేందుకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి ఏప్రిల్ 1 నుంచి 6వ తేదిలోపు 'జిల్లా ఉపాధ్యాయుల విద్య, శిక్షణ సంస్థ'ల ద్వారా సమర్పించాలి. ఈ గడువులోపు దరఖాస్తు చేసుకోనివారు ఏప్రిల్ 8,10 తేదీల్లో తత్కాల్ ప్రత్యేక పథకంలో అదనంగా రూ.1,000 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉపాధి హామీ పథకానికి రూ.400 కోట్లు

ఐసిఎఫ్, మార్చి 23: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రాష్ట్రప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. తొలివిడతగా కేంద్ర ప్రభుత్వ వాటా రూ.735 కోట్లు, రాష్ట్రప్రభుత్వ వాటాగా రూ.245 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రెండవ విడతగా కేంద్రం రూ.300 కోట్లు కేటాయించింది. దానితో రాష్ట్రప్రభుత్వం వాటా రూ.100 కోట్లు కలిపి రూ.400 కోట్లు విడుదల చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖ పరిశీలించిన ప్రభుత్వం నిధులు కేటాయించింది.

పూండి జలాలు విడుదల

ఐసిఎఫ్, మార్చి 23: వేసవి తాగునీటి అవసరాలకు పూండి నుంచి పుళల్ జలాశయానికి నీరు విడుదల చేస్తున్నారు. పుళల్, పూండి, చోళవరం, చెంబరంబాక్కం, తేర్వాయ్ కండిగై జలాశయాలు నగర తాగునీటి అవసరాలు పూర్తిచేస్తున్నాయి. వీటి మొత్తం సామర్థ్యం 11.7 టీఎంసీలు. ప్రస్తుతం గరిష్ఠంగా చెంబరంబాక్కంలో 2.91 టీఎంసీలు, పుళల్‌లో 2.83 టీఎంసీలు, పూండిలో 1.89 టీఎంసీలు, తేర్వాయ్ కండిగై 0.44 టీఎంసీలు, చోళవరంలో 0.21 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు పూండి నుంచి సెకనుకు 303 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తుండగా పుళల్‌కు 205 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది.

ఆమ్నీ బస్సుల ఆధ్వర్యంలో 100 వ్యాన్ సర్వీసులు

ఐసిఎఫ్, మార్చి 23: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కిలంబాక్కం కొత్త బస్ టెర్మినల్‌కు ప్రతిరోజు 100 వ్యాన్ సర్వీసులు నడుపుతున్నట్లు, ఇందుకు ప్రత్యేక ఛార్జీలు వసూలుచేయడం లేదని ఆమ్నీ బస్సుల యజమానులు తెలిపారు. కిలంబాక్కంలో కొత్త బస్ టెర్మినల్ ప్రారంభించిన అనంతరం కోయంబేడు, ఎగ్మూర్ వంటి ప్రాంతాల నుంచి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడానికి ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో, కోర్టును ఆశ్రయించగా, కోయంబేడు, పోరూర్, సూరపట్టు ప్రాంతాల్లో ప్రయాణికులను ఎక్కించుకొనేందుకు, దించేందుకు తాత్కాలిక అనుమతి లభించింది.

రేపు ఇస్కాన్ ఉత్సవాలు

ఐసిఎఫ్, మార్చి 23: కవర పూర్ణిమోత్సవాలు స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న ఇస్కాన్ రాధాకృష్ణ ఆలయంలో ఈ నెల 25వ తేది జరుగనున్నాయి. ఆ రోజు వేకువజామున 4.30 గంటల నుంచి మంగళహారతులు చేపట్టనున్నారు. ఉదయం 8 గంటలకు శ్రీమద్ భాగవత తరగతులు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కీర్తన మేళా జరుగనున్నాయి.

29న చెస్ పోటీలు

ఐసిఎఫ్, మార్చి 23: జీఎం చెస్ అకాడమి ఆధ్వర్యంలో బాలల 9వ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు స్థానిక తాంబరం గౌరివాక్కం వేళచ్చేరి మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర కళాశాల ప్రాంగణంలో ఈ నెల 29వ తేది జరుగనున్నాయి. 8,10,13,25 ఏళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీలు స్విజ్ ఆధారంగా ఫిడే నిబంధనల ప్రకారం జరుగనున్నాయి. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 27వ తేదిలోపు 8838229938 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

1 నుంచి ఐదు ప్రాంతాల్లో టోల్ పన్ను పెంపు

ప్యారీస్, మార్చి 23: రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో ఏప్రిల్ 1వ తేది నుంచి వాహనాలకు విధించే పన్ను పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 54 టోల్‌ప్లాజాల్లో పెంచిన టోల్ పన్నును రెండుగా విభజించి వసూలు చేస్తున్నారు. గత 2023 సెప్టెంబరు నుంచి 26 టోల్‌ప్లాజాల్లో పెంచిన పన్ను అమలు జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం మళ్లీ ఏప్రిల్ 1వ తేది అర్ధరాత్రి 12 గంటల నుంచి పెంచిన టోల్ పన్ను అమలుకు వస్తుందని భారత జాతీయ రహదారుల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, నెలవారీ టోల్‌ప్లాజా ఫీజు రూ.100 నుంచి రూ.400 వరకు పెరగనుంది. ఒకసారి ప్రయాణం చేసేందుకు, ఒకేరోజులో తిరిగి వచ్చేందుకు ఇప్పుడున్న ఫీజు రూ.5 నుంచి రూ.20 వరకు పెరుగనుంది.

వైభవంగా రంగనాథస్వామి ఆలయ రథోత్సవం

ప్యారీస్, మార్చి 23: స్థానిక షావుకారుపేటలో ప్రసిద్ధిచెందిన పురాతన రంగనాయకి సమేత రంగనాథస్వామి వారి ఆలయ రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17న ధ్వజారోహణ పూజలతో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి ఉత్సవమూర్తులను హనుమంత, గరుడ, సూర్యప్రభ, హంస, అశ్వ, గజ వాహనాల్లో పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. శుక్రవారం రాత్రి రంగమన్నార్‌ను అందంగా అలంకరించి పల్లకీలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ నెల 25న రాత్రి తిరుకల్యాణం, 26న సాయంత్రం స్తపన తిరుమంజనం, 31వ తేది సాయంత్రం విడయాత్రి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా, శనివారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివార్లను మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6 గంటలకు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జె.హరికుమార్ నేతృత్వంలో ఆలయ పూజారులు ఉత్సవమూర్తులను పూలతో అందంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి హారతి అనంతరం ముల్లా వీధి, తిరుపల్లి వీధి, మింట్ వీధి, కొండితోపు తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. ఈ ప్రాంతాలకు చెందిన భక్తులు రథంపై పూలుచల్లి స్వాగతం పలికారు.



అలంకరించిన రథంలో విహరిస్తున్న రంగనాయకి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులు

ఈసారి 5లక్షల ఓట్ల మెజారిటీతో తమిళచ్చి గెలుపు!

మంత్రి సుబ్రమణ్యం ధీమా

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సౌత్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్ ఐదు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందటం ఖాయమని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే సౌత్‌చెన్నై జిల్లా శాఖ పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఆ నియోజకవర్గంలో నిర్వహించాల్సిన ప్రచార కార్యక్రమాలపై చర్చలు జరిపారు. ఆ సందర్భంగా తమిళచ్చి తంగపాండ్యన్ పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సమావేశంలో సైదాపేట, వేళచ్చేరి, చోళింగనల్లూరు, విరుగంబాక్కం, టి.నగర్, మైలాపూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన డీఎంకే నేతలు, కాంగ్రెస్, డీపీఐ తదితర మిత్రపక్షాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొన్నప్పటికీ మునుపటిలాగే డీఎంకే కూటమి పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలలో ఘనవిజయం సాధిస్తుందని తెలిపారు. గత ఐదేళ్లుగా తమిళచ్చి తంగపాండ్యన్ పార్లమెంట్‌లో తన నియోజకవర్గం పరిధిలోని ప్రధాన సమస్యలపై ప్రస్తావించి వాటిని పరిష్కరించేందుకు పాటుపడ్డారని పేర్కొన్నారు.



తమిళచ్చి తంగపాండ్యన్‌ను గజమాలతో సత్కరిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణ్యం తదితరులు

సర్ త్యాగరాయ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

అడయార్, మార్చి 23: సర్ త్యాగరాయ కళాపరిషత్, ఉత్తర మద్రాస్ ఉగాది మహోత్సవ కార్యనిర్వాహకవర్గం సంయుక్తంగా క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 31వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 12 యేళ్ళలోపు బాలబాలికలకు వక్తృత్వ పోటీలు (సుమతి శతకం నుంచి), చిత్ర లేఖన పోటీలను స్థానిక ఓల్డ్ వాషర్‌మెన్‌పేట, నమశ్శివాయ ముదలి వీధిలో ఉన్న కన్నికలమ్మ దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించనున్నారు. అలాగే, ఏప్రిల్ 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. 14వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నమశ్శివాయ ముదలి వీధిలోని కన్నికలమ్మ దేవస్థానంలో 12 యేళ్ళలోపు బాలబాలికలకు విచిత్ర వేషధారణ పోటీలు, పంచాంగ పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగరంలోని తెలుగు ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఎంఆర్ సుబ్రమణ్యం, జక్కుల హరికృష్ణ, ఎస్.హనుమంతరావు, దేవి మాధవయ్యలు సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

రమణీయం రియల్ ఎస్టేట్స్‌తో అతుల్యా సీనియర్ కేర్ ఒప్పందం

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు వసతి గృహాలను నిర్మించే అతుల్యా సీనియర్ కేర్ సంస్థ కట్టడ నిర్మాణంలో రమణీయం రియల్ ఎస్టేట్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం నగరంలో 1000 పడకలతో సీనియర్ కేర్ నివాసాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా అతుల్యా సీనియర్ కేర్ ఎండీ డాక్టర్ కార్తీక్ నారాయణ్ మాట్లాడుతూ వచ్చే మూడేళ్లలో నగరంలోను, సబర్బన్ ప్రాంతాల్లోనూ వృద్ధులకు వెయ్యి పడకల సదుపాయంతో కూడిన నివాసాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమణీయం రియల్ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జగన్నాథన్, అతుల్యా సీనియర్ కేర్ సీఈఓ జి శ్రీనివాసన్, జే కృష్ణ కావ్య పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో సేలయూరు ఎస్‌ఐ అరెస్టు

చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలోని సేలయూరు పోలీసుస్టేషన్ స్పెషల్ ఎస్‌ఐ జాన్ సెల్వరాజ్‌ను బంగ్లాదేశ్ సైనికులు అరెస్టు చేశారు. తమ దేశ సరిహద్దుల్లో అక్రమంగా ప్రవేశించాడనే ఆరోపణలపై ఆయనను ఆ దేశ సైనికులు నిర్బంధించినట్లు సమాచారం అందింది. ఎస్‌ఐ జాన్ సెల్వరాజ్ నిందితులను న్యాయస్థానాలకు తీసుకెళ్లే విధులు నిర్వర్తించేవాడని, అదే సమయంలో తరచూ మెడికల్ లీవులు పెడుతుండేవాడని తెలిసింది. పదిహేను రోజులకు ముందు మెడికల్ లీవుపై వెళ్ళిన ఆయన విధులు తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో జాన్ సెల్వరాజ్ బంగ్లాదేశ్ సరిహద్దులో అక్కడి సైనికులు అరెస్టు చేసిన సమాచారం అందటంతో సేలయూరు పోలీసుస్టేషన్ అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనకు మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధాలు ఉంటాయని ఆ కారణంగానే బంగ్లాదేశ్ సైనికులు అరెస్టు చేసిన ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బంగ్లాదేశ్ సైనికులు జరుపుతున్న విచారణ ముగిసిన తర్వాతే వాస్తవాలు వెల్లడవుతాయని సేలయూరు పోలీసుస్టేషన్ అధికారులు తెలిపారు.



బంగ్లాదేశ్‌లో సైనికుల నిర్బంధంలో ఉన్న సేలయూరు సబిన్‌స్పెక్టర్ జాన్ సెల్వరాజ్

యువతిని గర్భవతిని చేసిన యువకుడికి ఏడేళ్ల జైలు

ప్యారీస్, మార్చి 23: స్థానిక ఆదంబాక్కం కక్కన్ నగర్‌కు చెందిన దామోదరన్ కుమారుడు సత్యరాజ్ (24) అనే యువకుడు వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేసిన కేసులో అతనికి న్యాయస్థానం ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. కక్కన్ నగర్‌కు చెందిన 21 ఏళ్ల యువతితో ఏర్పడిన సత్యరాజ్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. గత 2015 నుంచి అద్దెకు తీసుకున్న ఇంట్లో వీరు సహజీవనం చేసినట్లు తెలిసింది. రెండు కుటుంబాల పెద్దల అంగీకారంతో వివాహం చేసుకుంటానని హామి ఇచ్చిన సత్యరాజ్, తన ప్రియురాలి గర్భం దాల్చిన విషయం తెలిసి మోసం చేసినట్లు బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి విచారణ జరిపిన పోలీసులు, సత్యరాజ్‌ను అరెస్ట్ చేసి చెంగల్పట్టు న్యాయస్థానంలో హాజరుపరచారు. న్యాయమూర్తి ఎళిలరసి, నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.8,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాకుండా బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల పరిహారం అందజేయాలని న్యాయస్థానం సిఫారసు చేసింది.

ఇంట్లో పేలిన నాటు బాంబు : రౌడీ అరెస్టు

అడయార్, మార్చి 23: స్థానిక తాంబరంలోని ఓ ఇంటిలో నాటు బాంబులు తయారు చేస్తుండగా ఒక బాంబు పేలింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక రౌడీని అరెస్టు చేశారు. వెస్ట్ తాంబరం, కడప్పేరి, అర్పుదం నగర్‌కు చెందిన మురుగన్ (50) ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు తయారు చేసి విసిరిన నాటు బాంబు పేలింది. దీంతో ఆయన ఇంటి సిమెంట్ రేకులు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై తాంబరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అదే ప్రాంతానికి చెందిన గోల్డ్ మణి (26) అనే పాత రౌడీగా గుర్తించి అరెస్టు చేశారు. కేసు విచారణ జరుపుతున్నారు.

ఆరుగురు కనిపించలేదనే వార్తలు అసత్యం

ఈషా యోగా కేంద్రం

పెరంబూర్, మార్చి 23: తమ కేంద్రంలో ఆరుగురు ఉద్యోగులు కనిపించడలేదన్న వార్త పూర్తిగా అసత్యమని ఈషా యోగా కేంద్రం హైకోర్టుకు తెలిపింది. తెన్‌కాశి జిల్లాకు చెందిన రైతు తిరుమల మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో, స్వచ్ఛంద కార్యకర్తగా ఈషా యోగా కేంద్రంలో పనిచేసేందుకు వెళ్లిన తన సోదరుడు కనిపించడం లేదని, ఆయన ఆచూకీ కనుగొనేలా పోలీసులను ఆదేశించాలని కోరాడు. ఈ కేసుపై హైకోర్టు ఉత్తర్వులతో పోలీసు శాఖ దాఖలుచేసిన అఫిడవిట్‌లో.... ఇప్పటివరకు ఈషా యోగా కేంద్రంలో ఆరుగురు అదృశ్యమైనట్లు ఫిర్యాదులందాయని, వాటిపై విచారిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో యోగా కేంద్రం తరఫున హైకోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌లో, తమ కేంద్రంలో ఆరుగురు అదృశ్యమయ్యారన్న వార్త అవాస్తవమని, ఆధారాలు లేని ఇలాంటి వార్తలు నమ్మరాదని తెలియజేసింది.

నేడు ఈపీఎస్ ప్రచారం ప్రారంభం



చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. సేలం జలకంఠాపురం సమీపం కరియవరద రాజ పెరుమాళ్ ఆలయంలో ఆదివారం ఉదయం ఆయన దైవదర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత ఓపెన్ టాప్ వ్యాన్‌లో ప్రచారానికి బయలుదేరి వెళతారు. సేలం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన రోడ్‌షోలు జరిపి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత తిరుచ్చికి బయలుదేరి వెళతారు. సోమవారం సాయంత్రం తిరుచ్చి నావలూరుకుట్టపట్టు అనే చోట ఏర్పాటయ్యే అన్నాడీఎంకే కూటమి బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రసంగించనున్నారు. కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులను ఆయన సభకు పరిచయం చేయనున్నారు. డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, పుదియతమిళగం నేత డాక్టర్ కృష్ణసామి, ఎస్డీపీఐ అధ్యక్షుడు నెల్లై ముబారక్ తదితరులు ఈ సభలో పాల్గొంటారు.

గవర్నర్ ఆర్ఎన్ రవిని పదవి నుంచి తొలగించాలి

రాష్ట్రపతికి డీపీఐ ఎంపీ తిరుమాళవన్ విజ్ఞప్తి

ప్యారీస్, మార్చి 23: న్యాయస్థానాల ఉత్తర్వులను ఉల్లంఘించడంతో పాటు రాజ్యాంగానికి కళంకం సృష్టిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని పదవి నుంచి తొలగించాలంటూ డీపీఐ ఎంపీ తిరుమాళవన్ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చట్టం గురించి గవర్నర్ ఆర్ఎన్ రవికి ఏమీ తెలియదని అత్యున్నత న్యాయస్థానం ఆయనను సూటిగా ప్రశ్నించిందని, ప్రజలచే ఎన్నుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదనను తిరస్కరించి గవర్నర్ రాజ్యాంగానికి మచ్చ తీసుకొచ్చారని, ఆయనకు గవర్నర్ పదవిలో కొనసాగే అర్హత లేదని, అందువల్ల తనకున్న అధికారంతో రాష్ట్రపతి ఆర్ఎన్ రవిని గవర్నర్ పదవి నుంచి తక్షణం తొలగించాలంటూ లేఖ రాసినట్లు ప్రకటనలో తెలిపారు.

వేలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మాజీ మంత్రి వీరమణి

వేలూరు, మార్చి 23: వేలూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్నాడీఎంకే కృషి చేస్తుందని ఆ పార్టీ మాజీ మంత్రి వీరమణి తెలిపారు. వేలూరు నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీచేస్తున్న డా.పసుపతి పరిచయ కార్యక్రమం స్థానిక గ్రీన్ సర్కిల్‌లోని ఎతిరాజు కల్యాణ మండపంలో శనివారం జరిగింది.కార్యక్రమానికి వేలూరు నగర జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు అధ్యక్షత వహించగా, గుడియాత్తం యూనియన్ సెక్రటరీ రాము, మాజీ జిల్లా సెక్రటరీ మూర్తి, ఐటీ విభాగం సెక్రటరీ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరమణి మాట్లాడుతూ... గతంలో గెలిపించిన డీఎంకేకు చెందిన కదిర్ ఆనంద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నిర్వాహకులు దాస్, జానకిరామన్, వెంకటేశన్, నారాయణన్, లింగమూర్తి, జిల్లావ్యాప్తంగా సుమారు 1,500 మంది పార్టీ శ్రేణులు హాజరయ్యారు.



అన్నాడీఎంకే అభ్యర్థి పసుపతిని పరిచయం చేస్తున్న వీరమణి

పుట్టిన రోజు వేడుకల్లో విషాదం

స్నేహితురాలి మృతి - మహిళ సీరియస్

అడయార్, మార్చి 23: నగర శివారు ప్రాంతమైన పాత మహాబలిపురం రోడ్డు, ముట్టుక్కాడులో విషాదకర ఘటన జరిగింది. తల్లి పుట్టిన రోజు వేడుకలకు వెళ్ళిన కుమార్తె ఇపుడు ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతోంది. ఆమె స్నేహితురాలు మాత్రం ప్రాణాలు కోల్పోయింది. అన్నానగర్ వాసన్ వ్యూ అపార్ట్‌మెంట్‌కు చెందిన అనుసత్య (31) తన తల్లిపుట్టిన రోజు వేడుకల కోసం స్నేహితురాలు శైలజ (29)తో కలిసి ముట్టుక్కాడులోని తల్లి వద్దకు వెళ్ళింది. అక్కడ తన తల్లి పుట్టిన రోజు వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసింది. ఈ క్రమంలో తన స్నేహితురాలితో కలిసి ఫుల్‌గా మద్యం సేవించింది. ఆ తర్వాత ఈతకొలనులో వారిద్దరు దిగగా, నీటిలో మునిగిపోవడంతో అపస్మారకస్థితిలోకి జారుకున్నారు. నీటిపై వీరిద్దరూ తేలాడటాన్ని గమనించిన సెక్యూరిటీ గార్డులు వారిని రక్షించి, 108 అంబులెన్స్‌లో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శైలజ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అనుసత్య మాత్రం అపస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

స్కూటీలు మాత్రమే దొంగలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, మార్చి 23: గేర్ బైక్‌లు నడపడం తెలియకపోవడం, నగరంలో పలు ప్రాంతాల్లో స్కూటీలు మాత్రమే దొంగిలిస్తున్న 63 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని నుండి 12 స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. వేళచ్చేరి రైల్వే స్టేషన్ సమీపంలో పార్కింగ్ చేసిన స్కూటీ చోరీకి గురైందనే ఓ మహిళ వేళచ్చేరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు, అదే ప్రాంతానికి చెందిన ఇళంగో అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

దిండుగల్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 23: దిండుగల్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు వ్యవహారం కలకలం రేపింది. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన పళని కొండ ఆలయానికి వెళ్లేందుకు ముఖ్యమైన రైల్వేస్టేషన్‌గా దిండుగల్ ఉంది. ఈ రైల్వేస్టేషన్‌ను బాంబులతో పేల్చివేయనున్నట్లు అందిన ఈ-మెయిల్ మెసేజ్ చూసిన స్టేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో అక్కడకు చేరుకున్న సుమారు 50 మంది పోలీసులు, రైల్వేపోలీసులు స్టేషన్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్ వార్తగా నిర్ధారించి విచారణ చేపట్టారు.



వేలూరు సమీపం శ్రీపురం స్వర్ణాలయాన్ని శనివారం దర్శించుకున్న కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ పీఠాధిపతి శక్తి అమ్మ వద్ద ఆశీస్సులు తీసుకుంటున్న దృశ్యం

ఎన్నికల వ్యయ పర్యవేక్షకుల నియామకం

ఐసిఎఫ్, మార్చి 23: చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పర్యవేక్షకులుగా ఆరుగురిని ఎన్నికల కమిషన్ నియమించింది. ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని తిరువొత్తియూర్, ఆర్కే. నగర్, రాయపురం శాసనసభ నియోజకవర్గాలకు అభిజిత్, పెరంబూర్, కొళత్తూర్, తిరువికనగర్ శాసనసభ నియోజకవర్గాలకు హరహానంద్‌ను ఎన్నికల వ్యయపరిశీలకులుగా నియమితులయ్యారు. మధ్య చెన్నై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని విల్లివాక్కం, ఎగ్మూర్, అన్నానగర్ శాసనసభ నియోజకవర్గాలకు సుబోధ్ సింగ్, హార్బర్, చేపాక్కం, ట్రిప్లికేన్, థౌజండ్ లైట్స్ శాసనసభ నియోజకవర్గాలకు మధుకర్‌కుమార్ నియమితులయ్యారు. దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో విరుగంబాక్కం, టీనగర్, మైలాపూర్ శాసనసభ నియోజకవర్గాలకు ముఖేష్‌కుమారి, సైదాపేట, వేళచ్చేరి, షోలింగనల్లూర్ శాసనసభ నియోజకవర్గాలకు మానసి త్రివేది నియమితులయ్యారు.

26న రాష్ట్రానికి ఎన్నికల పరిశీలకులు

ఐసిఎఫ్, మార్చి 23: రాష్ట్రానికి 39 మంది ఎన్నికల జనరల్ పరిశీలకులు, 20 మంది పోలీసు పర్యవేక్షకులు ఈనెల 26న రానున్నారని ఎన్నికల కమిషనర్ సత్యప్రదసాహూ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నియోజకవర్గానికి ఒకరు చొప్పున 39మంది ఎన్నికల పరిశీలకులు, రెండు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున 20 పోలీసు పర్యవేక్షకులు కేంద్ర ఎన్నికల కమిషన్ పంపిస్తుందని, వీరు 26న చెన్నైకి రానున్నారని ఆయన తెలిపారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

వేలూరు, మార్చి 23: వేలూరు పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రాలను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 19న ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. పోలింగ్ ముగిసిన అనంతరం వేలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వేలూరు, ఆనైకట్టు, కేవీ కుప్పం, గుడియాత్తం, అంబూరు, వాణియంబాడి శాసనసభ నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను భారీ బందోబస్తు నడుమ తంథై పెరియార్ ప్రభుత్వ కళాశాలకు తరలించి, అక్కడ 24 గంటల సాయుధదళ బందోబస్తుతో కూడిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచనున్నారు. ఓట్ల లెక్కింపు రోజైన జూన్ 4వ తేది స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొని లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ను, ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎస్పీ మణివన్నన్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, అసిస్టెంట్ అధికారులు మురుగన్, కవిత, సుబ్బలక్ష్మి, సుమతి, అజీతబేగం, పీడబ్ల్యూడీ ఇంజనీర్ జయరామన్ తదితరులున్నారు.



లెక్కింపు కేంద్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, అధికారులు

డీఎంకే కూటమికి ఎంజీఆర్ కళగం మద్దతు

ప్యారీస్, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి ఎంజీఆర్ కళగం మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆర్ఎం వీరప్పన్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వీరప్పన్ నేతృత్వంలో జరిగిన పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఎంకే కూటమికి మద్దతుగా వీరప్పన్ రాసిన లేఖను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రామలింగం డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతికి అప్పగించినట్లు ప్రకటనలో తెలిపారు.

విశ్వనాథన్ ఆశీస్సులు పొందిన కదిర్ ఆనంద్

వేలూరు, మార్చి 23: వేలూరు లోక్‌సభ స్థానం నుంచి డీఎంకే అభ్యర్థిగా కదిర్ ఆనంద్ పోటీచేస్తున్నారు. ఆయన శనివారం వీఐటీ చాన్సలర్, మాజీ పార్లమెంటు సభ్యుడు విశ్వనాథన్, వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వంను కలుసుకొని ఆశీస్సులు పొందారు. ఆ సమయంలో డీఎంకే సెక్రటరీ మహ్మద్ సాదిక్ ఉన్నారు.



వీఐటీ చాన్సలర్ విశ్వనాథన్‌ను కలుసుకొని ఆశీస్సులు పొందుతున్న కదిర్ ఆనంద్

పట్టుచీరలు, మద్యం బాటిళ్లు స్వాధీనం

వేలూరు, మార్చి 23: స్థానిక కాట్పాడి సమీపంలోని సేర్కాడు ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్రం మదనపల్లి నుంచి జనార్ధనన్ అనే వ్యక్తి చెన్నైకి ఖరీదైన పట్టుచీరలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.4 లక్షల విలువైన 70 పట్టుచీరలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కసమ్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన అధికారులు 248 క్వార్టర్స్ మద్యం బాటిళ్లు, 33 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎస్‌కే.నవాజ్

అడయార్, మార్చి 23: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రధాన ఎన్నికల కమిటీ సభ్యుడిగా ఎస్కే నవాజ్ నియమితులయ్యారు. లోక్‌సభ ఎన్నికల కోసం ఏఐసీసీ అనేక కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఎన్నికల కమిటీ ఏఐసీసీతో కలిసి పని చేయనుంది. ఈ కమిటీ అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్, ఆర్గనైజర్‌గా రూబీ మనోహరన్‌ను ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ కమిటీ సభ్యుడిగా నవాజ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రకటన విడుదల చేసింది.

దాడిలో కారు డ్రైవర్ మృతి

కానిస్టేబుల్ అరెస్టు

పెరంబూర్, మార్చి 23: కానిస్టేబుల్ దాడితో కారు డ్రైవర్ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. స్థానిక చెట్‌పెట్ జగన్నాధపురం 2వ వీధికి చెందిన రాజ్‌కుమార్ (40) కాల్ టాక్సీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన గురువారం రాత్రి పూందమల్లి రహదారి వానగరం సమీపంలో రోడ్డు పక్కల కారు ఆపి నిల్చొని ఉన్న సమయంలో, హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతనిని గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లోని వైద్య సిబ్బంది అక్కడకు చేరుకొని అతనిని పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న మధురవాయల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, రాజ్‌కుమార్ సోదరుడు మధురవాయల్ పోలీస్‌స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో ఆ రోజు రాత్రి ఓ మహిళతో రాజ్‌కుమార్ రోడ్డు పక్కల కారులో మాట్లాడుతున్న సమయంలో, మధురవాయల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రిజ్వాన్ అక్కడకు చేరుకొని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని రాజ్‌కుమార్‌కు తెలిపాడని, ఆ సమయంలో ఇరువురి మధ్య వివాగం చెలరేగి, రాజ్‌కుమార్‌పై రిజ్వాన్ దాడి చేయడంతో అతను స్పృహ తప్పి కిందపడి మృతిచెందాడని, అనంతరం ఈ విషయం బయటకు చెప్పవద్దని ఆ యువతిని హెడ్ కానిస్టేబుల్ బెదిరించాడని, ఈ విషయాన్ని ఆ యువతి తనకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అదేసమయంలో యువతి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు.

గరిష్టస్థాయికి చేరిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మార్చి 23: రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 11గంటలకు అత్యధిక విద్యుత్ వినియోగం 19,409 మెగావాట్లుగా నమోదైంది. గతేడాది ఏప్రిల్ 20వ తేది విద్యుత్ వినియోగం 19,387 మెగావాట్ల అత్యధిక వినియోగం నమోదైన నేపథ్యంలో, ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే విద్యుత్ వినియోగం అధిక నమోదు విద్యుత్ బోర్డు అధికారులను కలవరపెడుతోంది.

క్యాన్సర్ బాధితులు 56,001 మంది

ఐసిఎఫ్, మార్చి 23: రాష్ట్రంలో 'మక్కలై తేడి మరుత్తువం' పథకంలో 56,001 మంది క్యాన్సర్ బాధితులు చికిత్స పొందుతున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ పథకం ద్వారా బీపీ, షుగర్ బాధితుల ఇళ్లకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేస్తున్నారు. ఇప్పటివరకు 1.54 కోట్ల మందికి పైగా ఈ పథకంలో లబ్ధిపొందారు. గత వారం రోజుల్లో మాత్రమే 1.76 లక్షల మంది బీపీ, క్యాన్సర్, షుగర్ బాధితులను గుర్తించినట్లు, వీరిలో కొత్తగా క్యాన్సర్ బాధితులు 56,001 మంది ఉన్నారని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో పెరగనున్న ఎండలు

పెరంబూర్, మార్చి 23: రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజుల్లో ఎండ తీవ్రత పెరగనుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ మేరకు ఆ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో, శుక్రవారం ఈరోడ్, కరూర్ సహా నాలుగు ప్రాంతాల్లో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం నుంచి ఐదు రోజులు సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. రాజధాని నగరం చెన్నైలో పగటి ఉష్ణోగ్రతలు 34-35 సెల్సియస్‌లు, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరన కేంద్రం తెలియజేసింది.

● ఓట్ల వేట



తంజావూరులో వాకింగ్‌కు వెళుతూ ఓట్లవేట సాగిస్తున్న సీఎం స్టాలిన్

వాకింగ్‌లో ఓట్ల సేకరణ

తంజావూరులో స్టాలిన్ సందడి


చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తంజావూరులో శనివారం ఉదయం వాకింగ్ చేస్తూ ఓట్లవేట సాగించారు. ఉదయసూర్యుడి గుర్తుపై ఓటేసి తంజావూరు డీఎంకే అభ్యర్థి మురసోలిని గెలిపించమంటూ అడిగారు. తిరుచ్చి బహిరంగ సభను ముగించుకుని స్టాలిన్ శుక్రవారం రాత్రి తంజావూరు చేరుకుని అక్కడి ప్రైవేట గెస్ట్ హౌస్‌లో బసచేశారు. శనివారం ఉదయం అభ్యర్థి మురసోలిని వెంటబెట్టుకుని వాకింగ్‌కు బయలుదేరారు. దారి పొడవునా ప్రజలకు నమస్కరిస్తూ డీఎంకే అభ్యర్థిని గెలిపించమంటూ కోరారు. తొలుత అన్నై సత్యా క్రీడా ప్రాంగణానికి వెళ్లి బాలబాలికలతో సెల్ఫీ దిగారు. యువకులతో వాలీబాల్ ఆడారు. ఆ తర్వాత కావం రాజ్ మార్కెట్‌కు వెళ్లి అక్కడి వ్యాపారులు, ప్రజల వద్ద ఓట్లవేట సాగించారు. దారిలో అక్కడక్కడా యువతీ యువకులు స్టాలిన్‌ను కలుసుకుని ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. తనను చూడటానికి రోడ్డుపై నిలిచిన చిన్నారుల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. చివరగా కీళ్‌రాజవీధిలో ఉన్న ఓ టీషాపుకు వెళ్లి పార్టీ కార్యకర్తలు, ప్రముఖులతో కలిసి టీ తాగారు. సుమారు ముప్పావుగంట సేప ఆయన తంజావూరు నగరమంతటా కాలినడనకే తిరిగి సందడి చేశారు. ఆ తర్వాత గెస్ట్‌హౌస్ చేరుకున్న స్టాలిన్ తంజావూరు రైతు సంఘాల నాయకులు కలుసుకుని లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.



● ఒక్కోసారి అంతే!

చలివేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సెగ

పెరంబూర్, మార్చి 23: వేసవి ప్రారంభం కాకముందే వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల దాహార్తి తీర్చేలా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటాయి. ఇక, అన్ని రాజకీయ పార్టీలు చలివేంద్రాలు ఏర్పాటులో పోటీపడుతుంటాయి. కానీ, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల పుణ్యమా అని ఎక్కడా చలివేంద్రాలు కానరావడం లేదు. ఒకవేళ ఏర్పాటుచేసేందుకు కొందరు యత్నించినా ఎన్నికల కోడ్ కారణంగా పలు అనుమతులు తీసుకోవాల్సి రావడంతో వెనుకంజ వేస్తున్నారు. రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసే చలివేంద్రాల ఖర్చు ఆ పార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల ఖాతాలోకి వెళుతుంటాయి. ఇక, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేయాలనుకుంటే పోలీసులు, సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారి అనుమతులు తీసుకోవాల్సి ఉంది.



● సరసమైన ధరలు

మటన్ బిర్యానీ రూ.200.. చికెన్ బిర్యానీ రూ.150

ఎన్నికల కమిషన్ ధరల పట్టిక

పెరంబూర్, మార్చి 23: మటన్ బిర్యానీ రూ.200, చికెన్ బిర్యానీ రూ.150 చొప్పున ఎన్నికల కమిషన్ ధరలు నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు అందించే 200 ఆహార పదార్థాల ధరలను ఎన్నికల కమిషన్ వెలువరించింది. ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఖర్చు చేయాల్సిన వ్యయం రూ.95 లక్షలు కాగా, గత 2019 ఎన్నికల్లో రూ.70 లక్షలుగా ఉంది. ప్రచారంలో కార్యకర్తలకు అందజేసే ఆహార పదార్థాలను సదరు అభ్యర్థి ఖాతాలో జమ చేస్తుంటారు. ఆ ప్రకారం, ఆహార పదార్థాలకు ఈసీ నిర్ణయించిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి.. టీ రూ.15, కాఫీ రూ.20, చికెన్ బిర్యానీ ధర గత ఎన్నికల్లో రూ.180 ఉండగా, ప్రస్తుతం రూ.150కి తగ్గించారు. ఇక, మటన్ బిర్యానీ రూ.200, వాటర్ బాటిల్ రూ.20, మజ్జిగ రూ.20, ఒక మీటరు పూలు రూ.65, అరటి చెట్లు రూ.700, బాణా సంచా సామగ్రి రూ.700గా నిర్ణయించారు.



● సాధారణ ఓటరు ప్రశ్న

రైలెప్పుడొస్తుంది?!

అభ్యర్థులను ప్రశ్నిస్తున్న పెరంబలూరు ఓటర్లు

ప్యారీస్, మార్చి 23: రాష్ట్రంలో రైలు రవాణా వసతి సరిగ్గా లేని జిల్లాల్లో ఒకటైన పెరంబలూరులో ప్రతి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే వారు తమను గెలిపిస్తే రైలు పథకం ప్రవేశ పెడతామని హామి ఇస్తారే కానీ, గెలిచిన తర్వాత ఒక్కరు కూడా మాట నిలబెట్టుకోలేదని విమర్శలున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లను మభ్యపెట్టేలా రైలు రాజకీయం సాగిస్తున్నాయి. ఆచరణకు సాధ్యం కాని హామీలు గుప్పించి ఓట్లు అభ్యర్థించడం తరతరాలుగా కొనసాగుతోంది. ఈ నియోజకవర్గంలో ఎంపీలుగా గెలిచిన డీఎంకేకు చెందిన ఎ.రాజా, సినీ నటుడు నెపోలియన్, అన్నాడీఎంకే నేత మరుదరాజా, డీఎంకే కూటమిలో ఎంపీగా గెలిచిన ఐజేకే వ్యవస్థాపకులు పారివేందర్‌లు అభ్యర్థిగా పోటీచేసిన సమయంలో రైలు పథకాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తంజావూరు జిల్లా కుంభకోణం నుంచి పెరంబలూరు మీదుగా నామక్కల్ వరకు ప్రయాణికులు, గూడ్సు రైళ్ల సేవలు అందుబాటులోకి వస్తాయని నమ్మిన ఓటర్లు అన్నాడీఎంకే, డీఎంకే పార్టీల అభ్యర్థులను గెలిపించారు. అయితే కేంద్ర రైల్వే శాఖ రైలు పథకం కోసం 2003,2018,2023 సంవత్సరాల్లో సర్వే మాత్రమే నిర్వహించాలంటూ జారీచేసిన ఉత్తర్వులు గెలిచిన ఎంపీల్లో ఒక్కరు కూడా అమలుపరచలేదు. ఈ నేపథ్యంలో, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ పెరంబలూరుకు రైలు సేవలను తీసుకొస్తామన్న హామీలతో ప్రచారం చేపట్టాయి. బీజేపీ కూటమి అభ్యర్థి పారివేందర్, డీఎంకే అభ్యర్థి అరుణ్‌లు ప్రచారం కోసం వెళ్లే ప్రాంతాల్లో రైలెప్పుడొస్తుందని ఓటర్లు నిలదీస్తున్నారు.

● అక్కడంతే.. వెరైటీ

ఎన్నికల ఉత్సవాలకు తరలిరండి

పెరంబూర్, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో జిల్లా ఎన్నికల అధికారులకు అవగాహన ప్రచారాలు చేపట్టారు. అందులో భాగంగా తిరునల్వేలి జిల్లా యంత్రాంగం నూతన పద్ధతిలో ఓటర్లు ఆహ్వాన లేఖకు పంపుతోంది. అందులో 'తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ఉత్సవాలకు ఆహ్వాన లేఖ. ప్రియమైన ఓటరుకు నమస్కారం. తిరువళ్లువర్ ఏడాది 2055 చిత్తిరై 6వ రోజు 19.04.2024 శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్ర ఎన్నికల సంఘం నడుపనున్న లోక్‌సభ ఎన్నికల ఉత్సవంలో, మీ దగ్గర్లోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోండి' అని ఆహ్వాన లేఖలో ముద్రించారు.



తిరునల్వేలి జిల్లా యంత్రాంగం ముద్రించిన ఆహ్వాన లేఖ

● సౌలభ్యం కోసం

అభ్యర్థులకు మొబైల్ యాప్

ఐసిఎఫ్, మార్చి 23: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఎన్నికల కమిషన్ పరిచయం చేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు సంబంధించిన వివరాలు తెలుసుకొనేందుకు 'సువిధ' అనే యాప్, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు సంబంధించిన వివరాలు తెలుసుకొనేందుకు 'సాక్ష్యం' అనే మరో యాప్‌ను పరిచయం చేశారు.



● నమ్మండి ప్లీజ్ !

మంత్రి నెహ్రూ కుమారుడికి కారు కూడా లేదట!



పెరంబూర్, మార్చి 23: పెరంబలూరు లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీచేస్తున్న మంత్రి నెహ్రూ కుమారుడు అరుణ్‌కు కారు, మోటార్ సైకిల్ లాంటి వాహనాలు లేవని తన నామినేషన్ పత్రంలో పేర్కొన్నారు. నామినేషన్ పత్రంలో ఆయన సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి... అరుణ్ పేరిట ఉన్న చరాస్తుల విలువ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం, 44 కోట్ల 20 లక్షల 89 వేల 472 ఉండగా, ఆయన భార్య పేరిట 83 లక్షల 47 వేల 283, పెద్ద కుమార్తె పేరిట 23 లక్షల 58 వేల 958, రెండవ కుమార్తె పేరిట 10 లక్షల 66 వేల 949గా ఉన్నాయి. అలాగే, స్థిరాస్తులు అరుణ్ పేరిట రూ.29 కోట్ల 6 లక్షల 37 వేల 500, ఆయన భార్య పేరిట రూ.25 లక్షలుండగా, ఆయన పేరుతో అప్పులు రూ.19 కోట్ల 13 లక్షల 95 వేల 432గా ఉన్నాయి. అదే సమయంలో ఆయన పేరుతో కారు, మోటార్ సైకిల్ లేవని నామినేషన్ పత్రంలో తెలిపారు.

● ప్రశాంతత కోసం..

రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది రౌడీలపై నిఘా!

● నగరంలో 5వేల మంది రౌడీషీటర్లకు హెచ్చరిక



చెన్నై, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించటంలో భాగంగా రాష్ట్రమంతటా సుమారు 20 వేల మంది రౌడీలపై పోలీసులు నిఘా వేస్తున్నారు. నగరంలోని ఐదు వేల మంది రౌడీలకు పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. ఎలాంటి అల్లర్లకు, కట్టపంచాయితీలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని రౌడీలను హెచ్చరించారు. రాష్ట్రంలో ఓటర్లకు నగదు బట్వాడాలలో పాత నేరస్థులు, రౌడీషీటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ పరిస్థితులలో ఏప్రిల్ 19న లోక్‌సభ ఎన్నికలను అల్లర్లకు, నగదు బట్వాడాకు తావులేని రీతిలో పకడ్బందీ నిర్వహించడానికి అటు ఎన్నికల సంఘం, ఇటు రాష్ట్ర పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోంది. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా రౌడీల కదలికలపై నిఘా వేసేందుకు ఇప్పటికే ప్రత్యేక పోలీసు దళాలను రంగంలోకి దింపారు. ఈ ప్రత్యేకదళం పోలీసులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో పాత నేరస్థుల చిట్టాలను, రౌడీషీటర్ల నేర చరిత్రను పరిశీలించి వారి కదలికలపై నిఘా వేయనున్నారు. రౌడీలు, రౌడీషీటర్లను వారు చేసిన నేరాల సంఖ్యను బట్టి ఏ, బీ, సీ అంటూ మూడు కేటగిరీలుగా రికార్డులలో నమోదు చేస్తున్నారు. ఈ విధంగా రాష్ట్రమంతటా సుమారు 20 వేల మంది రౌడీల పాత నేర చరిత్రలను ప్రత్యేక పోలీసు బృందాలు వెలికి తీసి పరిశీలన జరుపుతున్నారు. ఎన్నికలకు వారం రోజులకు ముందు ఈ రౌడీలను వారి ఇళ్ళ నుంచి కదలనీయకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇక రాష్ట్రంలో అత్యధిక రౌడీలున్న ప్రాంతంగా పేరుగడించిన రాజధాని నగరం చెన్నైలో రౌడీల భరతం పట్టేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. సుమారు ఐదువేలమంది రౌడీలపై నిఘా వేయడానికి చర్యలు చేపడుతున్నారు. చెన్నై తర్వాత తిరునల్వేలి, మదురై, కన్నియాకుమారి జిల్లాలు అత్యధిక సంఖ్యలో రౌడీలు సంచరించే జిల్లాలుగా ఉన్నాయి. ప్రస్తుతం వీరిలో పరారీలో ఉన్న రౌడీల ఆచూకీ కోసం తీవ్రగాలింపు చర్యలు ప్రారంభించారు. వీరిని వీలయినంత త్వరగా అరెస్టు చేసి జైలుకు పంపనున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేలమంది రౌడీలను పోలింగ్‌కు వారం రోజుల ముందే గృహనిర్బంధంలో ఉంచాలని నిర్ణయించారు. ఇక నగరంలో సుమారు రెండు వేల మంది రౌడీలను అరెస్టు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగారు. తక్కిన మూడు వేలమంది రౌడీల కదలికలపై ప్రస్తుతం నిఘా వేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికల లోపున రౌడీలపై కఠిన చర్యలు తీసుకోవడం ఖాయమని నగరానికి చెందిన సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

● కొన్ని మార్లు అంతే!

తేని నియోజకవర్గంలో ఓటేయనున్న బ్రూస్లీ, జాకీచాన్!

ప్యారీస్, మార్చి 23: రాష్ట్రంలో బ్రూస్లీ, జాకీచాన్, జెట్లీ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన వారు, అందులోనూ దివంగతులైన కొంతమంది ఇప్పుడెలా ఓటు హక్కు వినియోగించుకోగలరన్న అనుమానం మీకు రావడం ఖాయం. అయితే ఈ స్టోరీ చదవండి మరి! తేని నియోజకవర్గం పెరియకుళం తెంకరై చర్చి వీధికి చెందిన దివ్యాంగుడు ఆరోగ్యస్వామి 30 ఏళ్ల క్రితం ఆ ప్రాంతంలో ఎస్టీడీ బూత్ నడిపాడు. ఆయనకు జెట్లీ, బ్రూస్లీ, జాకీచాన్ అనే ముగ్గురు కుమారులున్నారు. వీరిలో మొదటి సారిగా ఓటేయనున్న జాకీచాన్ మాట్లాడుతూ... అవివాహితుడిగా ఉన్న తమ తండ్రి ఆరోగ్యస్వామి, హాలీవుడ్ చిత్రాల్లో నటించే హీరోల పేరే కాకుండా కుంగ్‌ఫూ, కరాటే తదితర స్వీయరక్షణ కలిగిన శిక్షణా ప్రముఖుల పేర్లను తమ ముగ్గురు అన్నదమ్ములకు పెట్టారని తెలిపాడు. సమైక్య భారతదేశంలో క్రీడలను మరింత ప్రోత్సహించే పార్టీ అధికారంలోకి రావాలని తన లక్ష్యమని వివరించాడు.



ఉత్తర చెన్నై అన్నాడీఎంకే అభ్యర్థి జయవర్ధన్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు



దక్షిణ చెన్నై బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌తో భేటీ అయిన టీఎంసీ అధినేత జీకే వాసన్ తదితరులు



ఓ పాఠశాలలో ప్రజలకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

● ఓటు కోసం తప్పదు మరి!

ర్యాంప్ వాక్‌లో డీఎంకే అభ్యర్థులు

పెరంబూర్, మార్చి 23: తిరుప్పూర్ పలవంజిపాళయంలో శుక్రవారం ఈరోడ్, పొల్లాచ్చి లోక్‌సభ నియోజకవర్గాల డీఎంకే అభ్యర్థుల పరిచయం సభలో, ఇద్దరు అభ్యర్థులు వేదికపై ర్యాంప్ వాక్ చేస్తూ పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాధన్ మాట్లాడుతూ... కోయంబత్తూర్ నియోజకవర్గంలో ప్రధాని నరేంద్ర మోదీ పోటీచేసినా, అక్కడ డీఎంకే అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.

స్క్రిప్టు, స్క్రీన్‌ప్లే పక్కాగా ఉంటే సినిమా హిట్టే

● దర్శకుడు వెట్రిమారన్

చిత్రజ్యోతి



ఆడియో రిలీజ్‌లో భారతీరాజా, జీవీ ప్రకాష్, వెట్రిమారన్ తదితరులు

స్క్రిప్టు, స్క్రీన్‌ప్లే పక్కాగా ఉంటే డైనోసార్‌ను హీరో పాత్రలో పెట్టి సినిమా తీసినా విజయం తథ్యమని, ఈ మాటలు వివాదాస్పదం అవుతాయని తెలిసినప్పటికీ.. ఇదే వాస్తవమని ప్రముఖ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ అన్నారు. యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత జి.ఢిల్లీ బాబు నిర్మించిన చిత్రం 'కల్వన్'. ఏప్రిల్ 4వ తేదీన విడుదలకానుంది. జీవీ ప్రకాష్ కుమార్, ఇవాన హీరోహీరోయిన్లు. దర్శక శిఖరం భారతీరాజా ఓ ముఖ్య పాత్రను పోషించారు. దీనా, జ్ఞానసంబంధం, వినోద్ మున్నా తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. హీరోగా నటించిన జీవీ ప్రకాష్ పాటలకు సంగీతం అందించగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ రెవా కంపోజ్ చేశారు. పలు చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన పీవీ శంకర్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈయనే చాయాగ్రహణం కూడా అందించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శనివారం నగరంలో జరిగింది. దర్శకుడు వెట్రిమారన్ ముఖ్య అతిథిగాను, సీనియర్ దర్శకుడు ఉదయకుమార్, పేరరసు, లింగుస్వామి, అమ్మ క్రియేషన్స్ అధినేత టి.శివ, సత్యజ్యోతి ఫిలిమ్స్ అధినేత త్యాగరాజన్, నిర్మాత ధనుంజయన్‌లతో పాటు జీవీ ప్రకాష్, ఇవాన, పీవీ శంకర్, చిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు. ఇందులో వెట్రిమారన్ మాట్లాడుతూ, 'ఫారెస్ట్ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ జరుపుకుంది. నిజానికి అడవిలో ఒక చిత్రం షూటింగ్ చేయడం చాలా కష్టం. ఒక సన్నివేశాన్ని వెండితెరపై అద్భుతంగా పండించే దర్శకనటుడు భారతీరాజా. ఆయన పాత్ర చిత్రానికి ఎంతో బలం. జీవీ ప్రకాష్ కమిట్‌మెంట్ కలిగిన నటుడు. అటు సంగీత దర్శకుడిగా, ఇటు హీరోగా రాణిస్తున్నారు' అన్నారు. చిత్ర నిర్మాత ఢిల్లీబాబు మాట్లాడుతూ, 'భారతీరాజా జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ మూవీని తెరకెక్కించే భాగ్యం దక్కాలని కోరుకుంటున్నారు. అలాంటి అవకాశం మా నిర్మాణ సంస్థకు వస్తే మాత్రం బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా, వెట్రిమారన్ సమ్మతిస్తే ఆయన దర్శకత్వంలోనే ఆ చిత్రాన్ని నిర్మించేందుకు సర్వదా సిద్ధంగా ఉన్నాను' అని ప్రకటించారు. భారతీరాజా మాట్లాడుతూ, 'సినిమాటోగ్రాఫర్‌గా పలు చిత్రాలకు పనిచేసిన పీవీ శంకర్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా అవతారమెత్తాడు. నటీనటుల నుంచి తనకు కావాల్సిన నటనను రాబట్టుకునే విషయంలో ఏమాత్రం రాజీపడడు. అతన్ని పనితీరును చూస్తే తొలి చిత్ర దర్శకుడు అని ఏ ఒక్కరు అనుకోరు. ఈ చిత్రంలో నన్ను అలా కష్టపెట్టి తనకు కావాల్సిన నటనను రాబట్టుకున్నాడు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత ఢిల్లీబాబుకు ధన్యవాదాలు' అన్నారు. దర్శకుడు పీవీ శంకర్ మాట్లాడుతూ, '2019లో ఈ చిత్రం ప్రారంభించినప్పటికీ కరోనా మహమ్మారి, చిత్రీకరణ సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురుకావడంతో జాప్యం జరిగింది. ప్రతి ఒక్కరికీ నచ్చేలా చిత్రం ఉంటుంది' అన్నారు. హీరో జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక మంచి కథతో, ప్రతి ఒక్కరకీ నచ్చే చిత్రంతో వచ్చే నెల 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మీడియా అండగా ఉండాలి' అని కోరారు. హీరోయిన్ ఇవాన తదతరులు ప్రసంగించారు.

నవ్యతను ఆస్వాదించేవారే నిత్య యవ్వనులు

● డాక్టర్ సుధా శేషయ్యన్



భౌతికశాస్త్రంలో పట్టా అందుకుంటున్న తెలుగు విద్యార్థిని

అడయార్, మార్చి 23: స్థానిక పట్టాభిరాంలో ఉన్న ధర్మమూర్తి రావు బహదూర్ కలవల కన్నన్ చెట్టి హిందూ కళాశాల (ఈవెనింగ్ కాలేజ్) 26వ స్నాతకోత్సవ వేడుకలు తాజాగా జరిగాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ సుధా శేషయ్యన్ పాల్గొన్నారు. ఇందులో వివిధ శాఖలకు చెందిన 1107 మంది విద్యార్థులకు ఆమె డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సుధా శేషయ్యన్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రుల కోసం ఒక రోజులో కనీసం రెండు నిమిషాలు, గురువుల కోసం మరో రెండు నిమిషాల సమయం కేటాయించి, వారిని స్మరించుకోవాలన్నారు. మరో రెండు నిమిషాలు మాతృభూమి కోసం కేటాయించి గత స్మృతులను ఓసారి నెమరు వేసుకోవాలన్నారు. అనునిత్యం ఉపయోగిస్తున్న నిత్య నూతన సాంకేతికతలోని మంచి మాత్రమే స్వీకరించి, చెడు విషయాలకు ఆమడ దూరంలో ఉండాలని ఆమె కోరారు. ఎందుకంటే నవ్యతను తెలుసుకుని, దాన్ని ఆస్వాదించేవారే నిత్య యవ్వనులుగా ఉంటారని డాక్టర్ సుధా శేషయ్యన్ అన్నారు. ఈ కార్యక్రమానికి కాలేజీ కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్ అధ్యక్షత వహించగా, ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జి.కల్విక్కరసి స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల కార్యవర్గ సభ్యుడు గౌతం, సంచాలకులు డాక్టర్ రాజేంద్ర నాయుడు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాలేజీ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్ మూవీగా 'ఫ్యామిలీ పడం'

'డైనోసార్' ఫేం ఉదయ్ కార్తీక్, సుభిక్ష జంటగా సెల్వ కుమార్ దర్శకత్వంలో 'ఫ్యామిలీ పడం' అనే పేరుతో ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కుతుంది. ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం నగరంలో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. యూకే క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కె.బాలాజీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'ఒక అందమైన కుటుంబంలో ఉండే అన్నదమ్ములు జీవితంలో వృద్ధిలోకి రావాలన్న లక్ష్యంతో పోరాటం చేస్తుంటారు. ఈ క్రమంలో వారిమధ్య జరిగే సంఘటనలు, ప్రేమ, గొడవలు, హాస్యం ఇలా అన్ని అంశాలతో ఒక ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ మూవీగా రూపొందిస్తున్నాం. కుటుంబ సమేతంగా అందరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. ఉదయ్ కార్తీక్, సుభిక్షలతో పాటు వివేక్ ప్రసన్న, పార్తిబన్, శ్రీజ, సంతోష్, ఆర్తీ ప్రియాంకలు ఇతర పాత్రలను పోషించారు. తొలి షెడ్యూల్ చెన్నైలో జరుపుకుంటుంది. ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన సంఘటనలు మదురైలో చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నాం. అనీవి సంగీతం అందిస్తున్నారు' అని వెల్లడించారు.



కొత్త చిత్ర పూజా కార్యక్రమం

యూట్యూబ్‌లో దూసుకెళుతున్న 'కంగువా' టీజర్

చిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య హీరోగా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా పదికిపైగా భాషల్లో నిర్మిస్తున్న చిత్ర 'కంగువా'. ఈ చిత్రం టీజర్‌ను ఇటీవల విడుదల చేయగా, యూట్యూబ్‌లో దూసుకెళుతుంది. విడుదలైన అతి తక్కువ సమయంలోనే సుమారుగా 2 కోట్ల వ్యూస్‌ను దక్కించుకుంది. నటుడు సూర్య ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్, దేవీశ్రీ ప్రసాద్ మెస్మరైజింగ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, అద్భుతమైన విజువల్స్ ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వీటితో పాటు 'యానిమల్' ఫేం బాబీ డియోల్ నటన మరింత బలం చేకూర్చింది. హీరోయిన్‌గా బాలీవుడ్ నటి దిశా పటానీ నటించారు. వెట్రి పళనిస్వామి సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రం తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీతో పాటు పదికిపైగా భాషల్లో రూపొందిస్తున్నారు. ఇందులోని యాక్షన్ సన్నివేశాలను సుప్రీం సుందర్ డిజైన్ చేయగా, కళా దర్శకుడిగా మిలన్ పనిచేశారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్ సంయుక్తంగా నిర్మించాయి.



'కంగువా'లో సూర్య